ఆరోగ్య కేంద్రాలు వెలవెల

- యూపీహెచ్‌సీలో కానరాని స్పెషలిస్టు వైద్యులు
- వైద్య సేవలు అందక రోగులకు అవస్థలు
- ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా చితికిపోతున్న పేదలు



ఖాళీగా దర్శనమిస్తున్న శివనగర్ ఆరోగ్య కేంద్రం

జీవీఎంసీ 50వ వార్డు ఆరోగ్య కేంద్రం

ఫార్మసీ వద్ద మందులు తీసుకుంటున్న మహిళ

మద్రిపాలెం : పేదలకు స్పెషలిస్టు వైద్యులతో నాణ్యమైన వైద్య సేవలు అందించిన ఆరోగ్య కేంద్రాలు ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యం వల్ల వెలవెలబోతున్నాయి. సామాన్యులకు వైద్యం దూరం.. దూరం.. అన్నట్లు తయారైంది. ఏ మనిషికైనా ప్రథమంగా కావాల్సింది ఉచిత విద్య, వైద్యం. ఈ రెండూ అందుబాటులో ఉంటే ఏదోలా జీవించవచ్చు. ఎందుకంటే ప్రస్తుత రోజుల్లో విద్య, వైద్య ఖరీదైపోయాయన్న విషయం జగమెరిగిన సత్యం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంట్లోని పిల్లలు చదువుకోవాలని, ప్రతి పేదవాడికి ఖరీదైన వైద్యం ఉచితంగా అందాలనే సదుద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగించారు. ప్రతీ గడపలో పిల్లలు చదువుకోవాలని కార్పొరేట్ స్కూల్స్‌కి ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారు. అలాగే ప్రతి పేదవాడికి లక్షలాది రూపాయలు ఖరీదు చేసే వైద్యాన్ని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా అందించారు. ఈ క్రమంలోనే ప్రతి వార్డులోనూ కోట్లాది రూపాయలు వెచ్చించి అందరికీ అందుబాటులో ఉండేలా వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేశారు. వైద్యం కోసం ఎక్కడో కిలోమీటర్ల దూరంలో ఉన్న కేజీహెచ్‌కు వెళ్లాల్సిన పని లేకుండా అవసరమైన స్పెషలిస్ట్ డాక్టర్లను అందుబాటులోకి తీసుకొచ్చి మెరుగైన చికిత్స అందించేలా చేశారు. ఫలితంగా సామాన్యులకు పైసా ఖర్చు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందేవి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కల్పించిన నాణ్యమైన వైద్య సేవలు ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయి. స్పెషలిస్టు వైద్యులను ఆరోగ్య కేంద్రాల నుంచి వేరేచోటకు బదిలీ చేసేయడంతో ఆస్పత్రులన్నీ వెలవెలబోతున్నాయి. గత ఆరేడు నెలల కాలంలోనే ఆరోగ్య కేంద్రాల్లో ఓపీ సేవలు తగ్గిపోయాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. రోజుకు 100కు పైగా రోగులు వచ్చిన చోట ఆ సంఖ్య తగ్గిపోయింది. అది కూడా గైనకాలజీ, చిన్న పిల్లల డాక్టర్లు అందుబాటులో ఉండడంతోపాటు బీపీ, షుగర్ చూపించుకునేందుకు వస్తున్న వాళ్ల వల్లే ఆమాత్రమైనా ఓపీ నమోదవుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రోగులకు తప్పని అవస్థలు

ఉత్తర నియోజకవర్గం పరిధిలోని 49వ వార్డు ఏఎస్ఆర్ నగర్, 50వార్డు మురళీనగర్, 51వ వార్డు అంబేడ్కర్ కాలనీ, 53వ వార్డు శివనగర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ప్రస్తుతం సంక్రాంతి పండగ సీజన్ కావడంతో రోగుల సంఖ్య కాస్త తక్కువగానే ఉంటుందని సిబ్బంది చెబుతున్నారు. అయితే ఆర్థోపెడిక్, డెర్మటాలజీ, జనరల్ సర్జన్ వంటి స్పెషలిస్టు వైద్యులు లేక రోగులు ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లను ఆశ్రయించి అధిక మొత్తంలో ఫీజుల భారంతో సతమతమవుతున్నారని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో ఉచితంగా పొందిన వైద్య సేవలకు ప్రస్తుతం ప్రైవేటు ఆస్పత్రుల్లో వేలాది రూపాయలు చెల్లించాల్సి రావడంతో నగరవాసులు ఆర్థికంగా చితికిపోతున్నారు.

- జీవీఎంసీ 49వ వార్డులో గతంలో 60 నుంచి 80 వరకు ఉన్న ఓపీ, ప్రస్తుతం 60కి పడిపోయింది. 50వార్డులో 20 నుంచి 40కి పెరిగింది. అయితే ఈ యూపీహెచ్‌సీలో గైనకాలజీ, పీడియాట్రిక్ డాక్టర్లు లేరు. ఇక్కడకు స్పెషలిస్టు వైద్యులను నియమించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ ఆరోగ్య కేంద్రంలో ఒక డాక్టర్ ఉంటే మరో డాక్టర్ రోగులను చూసే అవకాశం లేదు. ఇక్కడ ఒకటే చాంబర్ ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంతేకాకుండా ఈ కేంద్రంలో గైనకాలజీ చికిత్స కోసం మహిళలు వస్తుంటే ఆయా డాక్టర్లు ఈ కేంద్రంలో లేకపోవడంతో వారిని వేరే యూపీహెచ్‌సీకి వెళ్లాలని సిబ్బంది సూచిస్తున్నారు.
- ఇక 51 వార్డులో గతంలో 80 నుంచి 95 వరకు ఉన్న ఓపీ 65కి పడిపోయింది. 53వ వార్డులో 100 నుంచి 130 వరకు ఉండే ఓపీ 60కి పడిపోవడం దారుణమనే చెప్పాలి. ఈ రకంగా కూటమి ప్రభుత్వం పుణ్యమా అని స్పెషలిస్టు వైద్యులు లేక రోజు వారీ ఓపీ రోగుల సంఖ్య రోజురోజుకీ తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే ఉన్న డాక్టర్లు కూడా ప్రైవేట్ ఆస్పత్రులకు మారాలనే మొగ్గు చూపుతున్నారని, ఇప్పటికే పలువురు వెళ్లిపోయినట్టు స్థానికులు చెబుతున్నారు. ఏది ఏమైనా పేదవారికి వైద్యం అందించడంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి సాటి ఎవరూ లేరని నియోజకవర్గ ప్రజలు చెబుతున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా ప్రతీ వార్డులో కంటి నిపుణులు, చెవి, గొంతు, దంతవైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం ఎంతగానో ఉపయోగపడ్డాయని గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించి స్పెషలిస్టు వైద్యులను ఆరోగ్య కేంద్రాల్లో నియమించాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

హైస్కూల్‌కు ఫర్నిచర్ వితరణ



హెచ్‌ఎం శాంతికుమారికి ఫర్నిచర్ అందజేస్తున్న బ్యాంకు ప్రతినిధులు

సీతంపేట : సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఐడీబీఐ బ్యాంకు సీఎస్సార్ నిధులతో 25వ వార్డు మధురానగర్‌లోని జీవీఎంసీ హైస్కూల్‌కు ఫర్నిచర్ సమకూర్చారు. 20 కుర్చీలు, లైబ్రరీకి రెండు రాక్స్, 5 క్లాస్‌రూమ్ టేబుల్స్, 10 ఫ్యాన్లు, 5 ఎల్‌ఈడీ లైట్లు అందజేశారు. ఐడీబీఐ బ్యాంకు సీనియర్ రీజినల్ హెడ్ కన్వాడెబ్ దాస్, బ్రాంచి హెడ్ కిరణ్ ఫ్రాన్సిస్, ఏజీహెచ్ పి.శ్రీకిరణ్ చేతుల మీదుగా పాఠశాల హెచ్‌ఎం డి.శాంతి కుమారికి ఫర్నిచర్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీలలితా పీఠంలో చండీ హోమం



శ్రీలలితాపీఠంలో చండీ హోమంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న పండితులు

సీతంపేట : పుష్యమాసం బహుళ అష్టమి సందర్భంగా శ్రీలలితా పీఠంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉదయం చండీ హోమం, సాయంత్రం కాల భైరవ హోమం నిర్వహించారు. పండితుల వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా హోమాలు జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రతి శనివారం ఉదయం 5:30 గంటలకు సుప్రభాత సేవ, సాయంత్రం 6 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేన్ తెలిపారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం



అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం : జీవీఎంసీ 48వ వార్డు కైలాసపురం సూరిబాబు నగర్‌లో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ బుధవారం అంగన్‌వాడీ భవనం ప్రారంభించారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక తొలిసారిగా అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.25 కోట్లతో వార్డులో పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. నాటి విత్తనాలే నేటి ఫలాలుగా వార్డులో ప్రజలకు అందడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. సుమారు రూ.19 లక్షలతో నూతనంగా నిర్మించిన భవన శిలాఫలకాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, వైఎస్సార్‌సీపీ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మద్రిపాలెం : జోన్ – 2 ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధిలో 11 కేవీ కరాస ఫీడర్ నిర్వహణలో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ నిర్వహణ, చెట్ల కొమ్మలు తొలగింపు ప్రక్రియలో భాగంగా ఓల్డ్ కరాస, న్యూ కరాస, శాంతినగర్, మాధవధార వుడా కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

నిర్మాణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, తదితరులు

మద్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు ఆర్టీవో కార్యాలయం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న జీవీఎంసీ జోన్ – 5 కార్యాలయ భవన నిర్మాణ పనులను కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ బుధవారం పరిశీలించారు. సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న కార్యాలయం పనులను ఆయన స్వయంగా పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఇంజినీరింగ్ విభాగం ఏఈ రత్నాకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారి దేవస్థానంలో బుధవారం అర్చకుడు శ్రీనివాస్ గణపతి పూజ అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు జలాభిషేకం చేశారు. అర్చకుడు భక్తుల గోత్రనామాలతో విశేషపూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి జలాభిషేకం చేశారు. ఆలయ వర్గాలు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ ప్రొవైడర్స్ మేళాకి 119 దరఖాస్తులు



సర్వీస్ ప్రొవైడర్స్ వివరాలు పరిశీలిస్తున్న జోన్ - 3 యూసీడీ సిబ్బంది

సీతమ్మధార : జీవీఎంసీ జోన్ – 3 కార్యాలయం పరిధిలో చేపట్టిన సర్వీస్ ప్రొవైడర్స్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని యూసీడీ విభాగం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ రాము కోరారు. ఈ మేరకు జోన్ – 3 యూసీడీ విభాగం ఆధ్వర్యంలో ఆశీలమెట్టలోని జోనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో సర్వీస్ ప్రొవైడర్ల నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెప్మా సంస్థ, హోమ్ ట్రయాంగిల్ సంయుక్త ఆధ్వర్యంలో సర్వీస్ ప్రొవైడర్లను ఇ – కామర్స్ ప్లాట్‌ఫారమ్ మీదకి ఆన్‌బోర్డు చేయడానికి మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. శిక్షణ అనంతరం హోమ్ ట్రయాంగిల్ సంస్థ యాప్ ద్వారా ఆన్‌బోర్డ్ చేస్తారని తెలిపారు. మొదటి దశలో వడ్రంగులు, ప్లంబింగ్, విద్యుత్ సేవలు, విద్యుత్ ఉపకరణాలు, బ్యూటీషియన్లకు అవకాశమిస్తున్నామని తెలిపారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎలక్ట్రీషియన్ల నుంచి 35, ఏసీ మెకానిక్‌ల నుంచి 15, ప్లంబర్ల నుంచి 31, బ్యూటీషియన్ల నుంచి 28, బార్బర్ నుంచి ఒకటి, వాటర్ ప్యూరిఫైయర్ నుంచి రెండు, టీవీ మెకానిక్‌ల నుంచి రెండు, కార్పెంటర్ల నుంచి ఐదు కలిపి మొత్తం 119 దరఖాస్తులు జోనల్ కార్యాలయంలో స్వీకరించామని తెలిపారు. కార్యక్రమంలో జోన్ – 3 యూసీడీ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలను అన్ని రంగాల్లో ఎదగనిద్దాం

ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం



సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం

సీతమ్మధార : బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సహించి ఎదగనిస్తేనే జాతీయ బాలికా దినోత్సవానికి అర్థముంటుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. ఐసీడీఎస్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (సీడీపీవో) ఎం.వి.రమణ కుమారి, ఏసీడీపీవో శ్రీలత ఆధ్వర్యంలో మహారాణిపేట మండల స్థాయి మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, స్కూల్ నోడల్ టీచర్లు, విద్యా కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బందికి రేసపువానిపాలెం సామాజిక భవనంలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌమార దశ పిల్లల ఆరోగ్యం, అభ్యున్నతికి ప్రభుత్వం చేపడుతున్న పథకాలను వివరించారు. ఇంకా బాల్య వివాహాలు జరుగుతూనే ఉండడం విచారకరమన్నారు. వీటి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని కోరారు. సీడీపీవో ఎం.వి.రమణ కుమారి మాట్లాడుతూ కౌమార దశ అనేది చాలా క్లిష్టమైందన్నారు. మెడికల్ ఆఫీసర్ మన్మోహన్, అప్ హోల్డ్ ఎన్జీవో జిల్లా కో ఆర్డినేటర్ డేవిడ్ రాజ్ పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలలో చేపట్టాల్సిన చర్యలు, వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిటైర్డు చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కృష్ణవేణి, ఒన్ స్టాప్ సెంటర్ ఇన్‌చార్జి శరణ్య, సూపర్‌వైజర్లు సెల్వియా, వెన్నిసా సుందరి, కుమారి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నులకు అభయహస్తం



కుటుంబ సభ్యులకు మదీనావలిని అప్పగిస్తున్న ఏయూటీడీ సిబ్బంది

సీతమ్మధార: మానసిక వ్యాధితో బాధపడుతున్న మదీనావలిని ఏయూటీడీ సిబ్బంది కుటుంబ సభ్యులకు అప్పగించారు. 1వ పట్టణ పోలీసుల సహకారంతో సెప్టెంబర్ 2023లో ద్వారకానగర్‌లోని టీఎస్సార్ కాంప్లెక్స్‌లో గల జీవీఎంసీ-ఏయూటీడీ వసతి గృహానికి తరలించారు. తను యుక్త వయసులో ఉన్నప్పుడు తల్లి చనిపోవడంతో తండ్రి రెండో పెళ్లి చేసుకుని వదిలి వెళ్లిపోయాడు. దీంతో చెల్లి, తమ్ముడిని చూసుకుంటూ కుటుంబ భారాన్ని మోసేది. పెట్రోల్ బంక్ లో పని చేస్తూ చెల్లి పెళ్లి చేసింది. సొంత ఇల్లు కూడా కట్టింది. తమ్ముడు మూడు సంవత్సరాలుగా కనిపించకుండా పోవడంతో మొబైల్ ఫోనుకి బానిస అయి మానసిక ఆరోగ్యం దెబ్బతింది. ఏయూటీడీ అందించిన సేవలు, శ్రద్ధా బృందం చికిత్సతో చివరికి వ్యాధి నయం కావడంతో కంచరపాలెం దరి బర్మాకాంపు దగ్గర శ్రీనివాసనగర్‌లో ఉన్న పిన్ని మరియమ్మకి క్షేమంగా అప్పగించారు.

శ్రీకాకుళం వ్యక్తికి ఆశ్రయం..

శ్రీకాకుళంలోని ఆముదాలవలసలకు చెందిన అన్నపు ప్రసాద్ (54) కుటుంబ కలహాల వల్ల ఇల్లు వదిలి విశాఖ వచ్చేశాడు. ప్రస్తుతం భిక్షాటన చేసుకుంటూ బతుకుతున్నాడు. ఈ నేపథ్యంలో ఇతను దొండపర్తి ఫుట్‌పాత్‌పై ఉండగా ఏయూటీడీ సిబ్బంది చూసి నిరాశ్రయుల వసతిగృహానికి తరలించారు. ఇతనికి సెక్యూరిటీ ఏజెన్సీలో ఉపాధి చూపించే ప్రయత్నం చేస్తున్నట్లు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

అలరించిన త్యాగరాజ కీర్తనలు



త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తున్న గాయకులు

మురళీనగర్ : మురళీనగర్ రామాలయంలో సర్వేజనా సుఖినోభవంతు బృందం బుధవారం ఆలపించిన త్యాగరాజ కీర్తనలు భక్తులను అలరించాయి. సంస్థ బృందం నిర్వహించే త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా 178వ త్యాగరాజ కీర్తనల ఆలాపనా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మహిళలు కోలాటం ప్రదర్శించారు. అనంతరం త్యాగరాజ కీర్తనలు ఆలపించారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీఎన్ రెడ్డి, ఎస్.వరప్రసాద్, పి.శ్రీనివాసరావు, జీవీ ఆనందరావు, ఎస్ఎంకే మోహన్, విజయలక్ష్మి పాల్గొని కార్యక్రమం నిర్వహణకు సహకరించారు. సర్వేజనా సుఖినోభవంతు ప్రతినిధి సత్యమాధవి పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం..!



ప్రజలకు అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించి, అభివృద్ధి పనులు చేపట్టాల్సిన పాలకులు, అధికారుల నిర్లక్ష్యం విశాఖ నగరవాసులకు శాపంగా మారిందనే చెప్పాలి. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ఎప్పటికప్పుడు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లీకవడంతో ఆయా మార్గాల్లో పాదచారులు, వాహనదారులు ముక్కు మూసుకుని ముందుకు సాగాల్సిన దుస్థితి నెలకొంది. నిత్యం రద్దీగా ఉండే అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా తయారై బుధవారం లీకవడంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారు నరకయాతన అనుభవించారు. ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి లీకేజీ అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

కనులపండువగా అక్కయ్యపాలెం పరస



అమ్మవార్లకు పూజలు చేస్తున్న గౌరీ సేవా సంఘం ప్రతినిధులు



పరసలో స్థానికుల సందడి



పరసలో దుకాణాల వద్ద వస్తువులు కొనుగోలు చేస్తున్న స్థానికులు

సీతంపేట : అక్కయ్యపాలెం పరస ఉత్సాహంగా సాగింది. జగన్నాథపురంలో కొలువైన కుంచుమాంబ, ముత్యమాంబ, భూలోకమాత, వెంకటేశ్వర స్వామి, సీతారాముల పరస మహోత్సవం బుధవారం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాలను, పరిసరాలను విద్యుత్ దీపాలు, పూల దండలతో చూడముచ్చటగా అలంకరించారు. పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున పరసకు తరలిరావడంతో జనసందోహంతో వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా గౌరీ సేవా సంఘం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డ్యాన్స్ బేబీ డ్యాన్స్, సేవగరిడీలు, భజన చెట్టు, కోలాటం, విద్యుత్ దీపాలంకరణతో మూడుగుళ్ల ప్రాంతం కళకళలాడింది. పరసలో భాగంగా ఉదయం అమ్మవార్లకు, వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, జలాభిషేకం, కుంకుమపూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్లకు మొక్కులు చెల్లించారు. కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ, కార్పొరేటర్లు పెద్దిశెట్టి ఉషశ్రీ, ఆళ్ల లీలావతి, నాయకులు బొడ్డేటి మోహన్, మాదేటి కనకారావు, పీఎస్ఎల్ఎన్ ప్రసాద్, సరిసా ప్రసాద్, కర్రి అచ్యుతరావు, రాజగిరి అచ్చన్న, పిల్లా నాగేశ్వరరావు తదితరులు అమ్మవార్లకు పూజలు చేశారు. గౌరీ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు పి.ఎస్.జె.వి.ప్రసాద్, కమిటీ చైర్మన్ రాజగిరి అప్పలరాజు, మళ్ల త్రినాథరావు, పిల్లా పకీరునాయుడు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బస్సుల పార్కింగ్‌తో ఇబ్బంది కలిగిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ప్రసాద్

సీతమ్మధార : రోడ్డు పక్కన ట్రావెల్ బస్సుల పార్కింగ్‌తో ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దని ద్వారకా సబ్ డివిజన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.ఎస్.ఎన్.వి.ప్రసాద్ కోరారు. రామాటాకీస్ సమీపంలోని విశాఖ కంటి ఆస్పత్రి సమీపంలో గల ప్రైవేట్ ట్రావెల్ బస్సుల నిర్వాహకులతో బుధవారం రేసపువానిపాలెంలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్యం జంక్షన్ నుంచి రామాటాకీస్‌కు వెళ్లే ప్రధాన రహదారికి రెండు వైపులా ప్రైవేట్ బస్సులు ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడం వల్ల పాదచారులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నట్టు తమకు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ట్రాఫిక్‌కి ఆటంకం లేకుండా మాత్రమే బస్సులు పార్కింగ్ చేసుకోవాలని స్పష్టం చేశారు. ఆటోడ్రైవర్లు ఎక్కువ ఛార్జీలు వసూలు చేసినా నేరుగా పోలీస్ కమిషనర్‌కి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ద్వారకా సబ్ డివిజన్ ఎస్ఐ ప్రతాప్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.